క్లుప్తంగా

నాగారం పంచాయతీని ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మార్చాలి

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామాన్ని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మార్చాలని సోమవారం గ్రామ దళితులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు విన్నవించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వారు తమ సమస్యను కలెక్టర్‌కు వివరించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి తమ పంచాయతీలో ఎస్సీ రిజర్వేషన్ కల్పించలేదని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళితులకు అవకాశం కల్పించాలని కోరారు.

పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న పోచమ్మ తల్లి

ధారూరు: మండల కేంద్రంలో నెలకొన్న గ్రామ దేవత పోచమ్మతల్లికి సోమవారం కల్వ మహేందర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలకంరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి కుమార స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వంట సామగ్రి



వంట సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ గోపాల్

పరిగి: ప్రభుత్వ పాఠశాలలకు మండల విద్యాధికారి గోపాల్ సోమవారం వంట సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పరిగి, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, పూడూర్ మండలాల్లో పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పరిగి విద్యావనరుల కేంద్రంలో ఈ సామగ్రి ఉందని ఆయా పాఠశాలల వారికి పంపిణీ చేస్తామని చెప్పారు. మండలాల వారికిగా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏజెన్సీలు వచ్చి సామగ్రిని స్వీకరించాలని సూచించారు.

భూలక్ష్మమ్మకు బోనాలు



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

బంట్వారం: కోట్‌పల్లి మండలత పరిధిలోని బార్వాద్‌లో సోమవారం భూలక్ష్మమ్మ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

నిలిచిన 'భగీరథ'

ఇబ్బంది పడుతున్న హకీంపేట్ గ్రామస్తులు



పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్‌లో రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఓ ఇంటి నిర్మాణం కోసం గుంతలు తవ్వుతుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి కోసం బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి ఆనందను సంప్రదించగా.. మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయిస్తామన్నారు.

అరకొర సిబ్బందితో పశువైద్యం

ఐదు క్లస్టర్ల పరిధిలో ఇద్దరు పశువైద్యులే ఉండడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్లు, సరిపోను సిబ్బంది లేక మూగజీవాల చికిత్సకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఐదు క్లస్టర్లకు ఇద్దరే వైద్యులు

- ఖాళీ పోస్టులు భర్తీ చేయక రైతులకు ఇబ్బందులు
- వైద్యులు సకాలంలో రావడం లేదంటూ ఆరోపణలు



చౌడాపూర్ పశువైద్యశాల

కుల్కచర్ల: వ్యవసాయ రంగానికి అనుబంధ రంగమైన పాడి పరిశ్రమ రైతులకు కీలకమైనది. కాగ ప్రస్తుతం పాడి పరిశ్రమను పర్యవేక్షణ చేసేందుకు సరిపడ సిబ్బంది లేక ఉన్న సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తమ జీవనోపాధికి తెచ్చుకున్న ఆవులను, గేదెలకు అనారోగ్య సమస్యలు వస్తే పట్టించుకునే వారు కరువయ్యారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోస్టులు ఖాళీ

కొన్ని నెలల క్రితం పశు సంవర్ధక శాఖలో బదిలీలు జరగడంతో ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలయని దుస్థితి. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో 56 గ్రామాలు, 30 అనుబంధ గిరిజన ఆవాసాలు ఉన్నాయి. ఇక్కడ అధికశాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఈ రెండు మండలాల పరిధిలో ఐదు క్లస్టర్లు (కుల్కచర్ల, ముజాహిద్‌పూర్, పుట్టపహడ్, చౌడాపూర్, మరికల్) ఉన్నాయి. ఇవి ఉమ్మడి కుల్కచర్ల మండలం ప్రాతిపదికగానే కొనసాగుతున్నాయి. వీటిలో పనిచేయాల్సిన మూడు వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు, లైఫ్ స్టాక్ అసిస్టెంట్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇన్‌చార్జి పర్యవేక్షణలో చౌడాపూర్

చౌడాపూర్ మండలం నూతనంగా ఏర్పడినప్పటికీ కొత్త పశువైద్యాధికారి పోస్టు మంజూరు చేయలేదు. దీంతో రెండేళ్లుగా ఇన్‌చార్జి పర్యవేక్షణలోనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యుల్లో ఒకరు సెలవులో ఉండడంతో ఒక్క వైద్యురాలు ఐదు క్లస్టర్లను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. వారు స్థానికంగా ఉండకపోవడంతో ఎప్పుడు ఎక్కడకు వస్తున్నారు ఎప్పుడు వెళ్తున్నారో సమాచారం ఉండడం లేదు. ముజాహిద్‌పూర్‌కు కేటాయించబడిన పోస్టుతోనే చౌడాపూర్ మండల పశువైద్యాధికారిగా ఇన్‌చార్జి సేవలు అందిస్తున్నారు. కొంతమంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది పశువైద్యశాలలో ఉన్నప్పుడే అవి తెరుచుకుంటున్నాయి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పశువైద్యాన్ని మెరుగుపర్చాలని రైతులు కోరుతున్నారు.

అటెండర్ ఉంటాడు



మా పశువులకు అనారోగ్య సమస్య వచ్చిందని పశు వైద్యశాలకు వెళ్తే అటెండర్ తప్ప డాక్టర్ కనిపించరు. వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియదు. ఒక్కోసారి మందులు లేవు తర్వాత రమ్మని చెప్తారు. పొలం దగ్గరకు వచ్చి వైద్యం చేయాలని కోరితే వైద్య సిబ్బంది నుంచి ఆశించిన సమాధానం రావడం లేదు. డబ్బులు వెచ్చించి ప్రైవేటుగా వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది.

– కావలి నర్సింలు, పాడిరైతు, చౌడాపూర్

36 ఏళ్లకు ఒక్క చోట

ఉపాధ్యాయులను సన్మానించుకున్న పూర్వవిద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మేరినాట్స్ హైస్కూల్‌లో 1989 సంవత్సరం 7వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో 7వ తరగతి పూర్తి చేసి 36 సంవత్సరాలు అయిన బృందం వారికి బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం తమ జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు.



1989లో ఏడో తరగతి విద్యార్థి బృందం

కల్వర్టు మరమ్మతు పనులు షురూ



కొనసాగుతున్న కల్వర్టు మరమ్మతు పనులు

దుద్యాల్ : మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దుద్యాల్ గేట్ నుంచి కొడంగల్ వరకు చేపట్టిన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తిగా నిర్మించిన కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ నెల 16న 'సాక్షి'దినపత్రికలో 'నిలిచిన పనులు..రాకపోకలకు తిప్పలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సోమవారం దుద్యాల్ గేట్ నుంచి హస్నాబాద్ గ్రామాల మధ్యనున్న నాలుగు కల్వర్టుల వద్ద మరమ్మతు పనులు ప్రారంభించారు.

సాక్షి ఎఫెక్ట్..

నీటి వృథా కట్టడికి చర్యలు



మరమ్మతు పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి సాహేరబేగం

దోమ: గ్రామంలో మిషన్ భగీరథ నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి సాహేర బేగం అన్నారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'మిషన్ భగీరథ నీరు వృథా!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ అధికారులు సిబ్బందితో లీకేజీ ప్రాంతంలో మరమ్మతు చేయించారు. ట్యాప్ ఏర్పాటు చేయించారు.

తూకాలు లేవు.. లారీలు రావు

- ధాన్యం విక్రయానికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మొలకెత్తిన వడ్లను చూపుతున్న నాగారం రైతులు

ధారూరు: అకాల వర్షాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రతీ రోజు సాయంత్రం కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని నాగారం, గురుదోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం మొలకెత్తుతున్నాయి. పాలిథీన్ కవర్లు కప్పి ఉంచినా కింద నుంచి ప్రవహిస్తున్న వరద కారణంగా ధాన్యం తేమ శాతం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నా.. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు 17 శాతం కన్న తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తున్నారని.. ఏమాత్రం తేమ ఉన్నా తూకం వేయడం లేదని వాపోతున్నారు. తూకాలు వేయడంలో జాప్యం, తూకం వేసినా తరలించడంలో అలసత్వం వెరసి బస్తాల్లో ధాన్యం మొలకెత్తుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 40 లారీల ధాన్యం రైతుల వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉందని, కొనుగోలు కేంద్రం వద్ద 3 వేల బస్తాలు నిల్వ ఉన్నాయని రైతులు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే



రోడ్లపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్లతో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షానికే నీటితో నిండి ప్రయాణానికే ఇబ్బందిగా మారుతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లలో నీరు నిలిచపోవడంతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతల్లో మట్టి పోయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ధర్మాపూర్ వాగు

ధారూరు: మండల పరిధిలోని ధర్మాపూర్ వాగు సోమవారం ఉధృతంగా ప్రవహించింది. మండల పరిధిలోని ధర్మాపూర్, మున్నూరుసోమారం, కాచారం, ఎబ్బనూర్ తదితర గ్రామాల పరిధిలో వర్షం కురిసింది. ఎండాకాలంలో వాగు ప్రవహించడంతో సమీప గ్రామాల ప్రజలు వంతెన వద్దకు వచ్చి ఆసక్తిగా తిలకించారు.

గోడు వినండి.. గూడు కల్పించండి

దివ్యాంగ దంపతుల వేడుకోలు



ఇబ్రహీంపట్నం రూరల్: నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు వచ్చిన వీరు చంపాపేట్‌లో నివసించే రొండి నాగమ్మ, నాగేష్. దంపతులు ఇద్దరూ దివ్యాంగులే. పీజీ వరకు చదువుకున్నారు. వీరికి ఆరేళ్ల పాప ఉంది. ప్రస్తుతం పనులు చేయలేక ఇంట్లోనే ఉంటున్నారు. అద్దె ఇంట్లో కిరాయి సైతం చెల్లించ కలేక ఇబ్బందులు పడుతున్నారు. నిరుపేదలమైన, దివ్యాంగులమైన తమకు ప్రభుత్వ పథకం కింద ఇల్లు కేటాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు అనే కమార్లు విన్నవించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆపసోపాలు పడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా రు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చారు. కలెక్టర్ కలవకపోవడంతో అధికారులకు అర్జీ సమర్పించారు. ఈ నెల 6న కూడా ప్రజావాణిలో మొ రపెట్టుకున్నామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. నగరం నుంచి ఇంత దూరం రావాలంటే ఇబ్బందిగా ఉందని.. జీ వనోపాధికరువై, బతుకుభారమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తమ గోడు పట్టించు కుని ఉండటానికి ఎక్కడైనా కాస్త గూడు క ల్పించి ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు.

కారులోకి దూసుకెళ్లిన క్రాష్ బారియర్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



హిలాల్ మృతదేహం

- ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే బెంగాల్‌వాసి దుర్మరణం
- గంటల తరబడి శ్రమించి మృతదేహం వెలికితీత

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. క్రాష్ బారియర్‌ను ఢీకొట్టడంతో కారులోకి పది మీటర్ల మేర దూసుకెళ్లిన ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన కితాబ్‌అలీ అలియాస్ హిలాల్ (35) ఘట్‌కేసర్ మండలం నాగారంలోని శిల్పానగర్, విశ్వసాయి బృందావనం అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. తుక్కుగూడ సమీపంలోని వివిధ కంపెనీలకు మ్యాన్‌పవర్ సప్లయ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం తుక్కుగూడకు వచ్చి తిరిగి నాగారం వైపు కారులో వెళ్తున్నాడు. బొంగ్లూర్ ఎగ్జిట్ 12 వద్దకు రాగానే అతివేగం అజాగ్రత్తగా వాహనం నడుపుతూ క్రాష్ బారియర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు అద్దంలో నుంచి క్రాష్ బారియర్ పది మీటర్ల వరకు దూసుకెళ్లింది. క్రాష్ బారియర్‌లోనే కారు ఉండిపోయింది. ప్రమాదంలో కితాబ్‌అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో క్రాష్‌బారియర్ ఇరక్కుపోవడంతో మృతదేహం బయటకు తీయడం పోలిసులకు కష్టతరం అయ్యింది. ఔటర్ రింగ్‌రోడ్డు సిబ్బందిని పిలిపించి కారు పైభాగం కట్ చేయించారు. గంటల తరబడి శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరన్‌కోట్ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఇస్మాయిల్

తాండూరు రూరల్: జిల్లా లోని మేజర్ పంచాయతీ కరన్‌కోట్‌లో కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉందని సోమవారం 'సాక్షి'దినపత్రికలో 'పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీ'వార్త ప్రచురితమైంది. ఇందుకు డీపీఓ జయసుధ స్పందించి విషయంపై ఆరా తీశారు. మండల అధికారులతో మాట్లాడి వెంటనే నియమించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మల్కాపూర్ పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్‌కు కరన్‌కోట్ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



పరిగి: సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: కామ్రేడ్ సుందరయ్య ఆశయసాధన కోసం నిరంతరం కృషి చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. దక్షిణ భారత కమ్యూనిష్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య రాజకీయాల్లో కొత్త మార్గాన్ని చూపారన్నారు. నాయకుడు ఎలా ఉండాలో సమాజానికి తెలియజేసి దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించి 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పదివేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాన్ని నింపిన యోధుడు అని కొనియాడారు. ఆయన సేవలను ప్రజలు ఎన్నటికి మరవలేరని ఆయన చూపిన మార్గంలో ప్రజలకు సేవచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, రఘురాం, అయూబ్, అమీర్, గోపాల్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి

దుద్యాల్: సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ.. ఉద్యమమే ఊపిరిగా.. ఆశయాలే గీటురాయిగా బతికిన వైతాళికుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. పీడిత ప్రజల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, నర్సయ్య, శ్రీనివాస్, రాజు, రాములు, దాదుమియా పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు

అనంతగిరి: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ అన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్‌లో..



అనంతగిరిలో..